## తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించాలి






జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
మంగళవారం 26 మే 2026 పేజీలు : 8




## కోల్ పెన్షన్ పథకాన్ని పునర్వ్యవస్థీకరించాలి

## కనీస పెన్షన్ 10 వేలుకు పెంచాలని డిమాండ్

## సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన బొగ్గు గని కార్మికులు తమ జీవితాలను చీకటి గనుల్లో గడిపి దేశానికి వెలుగునిచ్చారని, కానీ పదవీ విరమణ అనంతరం వారు అవమానకర పరిస్థితుల్లో జీవించాల్సి వస్తోందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, సంఘం మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉత్పత్తి నుండి పరిశ్రమల వరకు ప్రతి రంగం బొగ్గుపైనే ఆధారపడిన కాలంలో గని కార్మికుల కష్టం దేశాభివృద్ధికి మూలస్థంభమైందన్నారు. అయితే పదుల సంవత్సరాలు సేవలం దించిన బొగ్గు గని కార్మికులు ప్రస్తుతం నెలకు వెయ్యి రూపాయల నుండి కొద్దిపాటి పెన్షన్‌తోనే జీవించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులు, కుటుంబ అవసరాల నేపథ్యంలో ఈ పెన్షన్‌తో జీవించడం అసాధ్యమైంద న్నారు. బొగ్గు గని పెన్షన్ పథకం-1998 అమలులోకి వచ్చినప్పటి నుంఛి పెన్షన్‌లో గణనీయమైన సవరణలు జరగలేదని తెలిపారు.

## " ప్రజావాణి" దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



' ప్రజావాణి" కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.

## రైతులు ఆందోళన చెందవద్దు.. ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసారి చెన్నూర్ నియోజకవర్గంలో వరి పంట అంచనాలకు మించి అధిక దిగుబడి వచ్చిందని, ప్రస్తుతం కొనసాగుతున్న అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.



# రైతులు ఆందోళన చెందవద్దు.. ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

## చెన్నూర్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం

### రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి




**మంచిర్యాల, 25, మే (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసారి చెన్నూర్ నియోజకవర్గంలో వరి పంట అంచనాలకు మించి అధిక దిగుబడి వచ్చిందని, ప్రస్తుతం కొనసాగుతున్న అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడం ద్వారా కొనుగోలు ప్రక్రియ మరింత సులభంగా, వేగంగా పూర్తవుతుందని సూచించారు. చెన్నూర్ ప్రాంతంలో ధాన్యం నిల్వ కోసం గోదాముల సౌకర్యాలను పెంచడంతో పాటు హమాలీల సంఖ్యను కూడా పెంపొందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న లారీలకు అదనంగా మరో 75 లారీలను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు . జిల్లా కలెక్టర్‌తో పాటు అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. రాబోయే వారం రోజుల్లో రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరను చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు ఆలస్యం చేయకుండా తమ వరి ధాన్యాన్ని సమీప కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని మంత్రి గడ్డం వివేకానంద కోరారు.

# "ప్రజావాణి" దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### అధికారుల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చర్యలు
### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల, 25, మే (ప్రజా జ్యోతి):** "ప్రజావాణి" కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములులతో కలిసి అర్జీదారుల నుంచి సోమవారం దరఖాస్తులను స్వీకరించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన పొగాకు బుచ్చిబాబు తాము కొనుగోలు చేసిన భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టి కొంతమేర పూర్తి చేసి అనివార్య కారణాలతో నిలిపివేయాల్సి వచ్చిందని, నిర్మాణ గడువును పొడిగిస్తూ అనుమతి పత్రం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మందమర్రి పట్టణం ఒర్రెగడ్డ ప్రాంతానికి చెందిన బర్ల సుగుణ తన భర్తకు చెందిన ఆస్తిని ఆయన మరణానంతరం పెద్ద కుమారుడు తన పేరిట మార్పు చేసుకునేందుకు కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆస్తి మార్పిడిపై విచారణ జరిపి తమను రక్షించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. నస్పూర్ మండలం సింగాపూర్‌కు చెందిన సల్లూరి పోశమ్మ తన భర్త పేరిట ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా ఆయన మరణించారని, ఆ ఇంటిని తన పేరిట మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామానికి చెందిన మద్దెల గట్టయ్య తనకు గుడిపేట శివారులో గల భూమి రెవెన్యూ రికార్డుల్లో తప్పుగా నమోదు అయిందని, దానిని సవరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణ రాజీవ్ నగర్ కాలనీకి చెందిన బొల్లం సుజాత తాను ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకోగా ఎల్-1 జాబితాలో పేరు ఉన్నప్పటికీ ఫేజ్-1, ఫేజ్-2 జాబితాల్లో పేరు రాలేదని, ఇల్లు మంజూరు చేయాలని కోరారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్‌కు చెందిన గెరిక దుర్గ తాము పూల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నామని, రెండు పడక గదుల ఇండ్లలో లక్కీ డ్రా పద్ధతిలో ఇల్లు వచ్చినప్పటికీ సర్వే నిర్వహించి ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మొహమ్మద్ సర్వర్ బి తన భర్త మరణించాడని, పిల్లల పోషణ కోసం ఆసరా పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 91 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం



**మంచిర్యాల, 25, మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా రోజురోజుకు తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, ఈ వ్యాధుల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, జిల్లాలో తలసేమియా మరియు సికిల్ సెల్ వ్యాధుల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. వ్యాధుల నివారణతో పాటు ప్రజలను చైతన్యపరిచేందుకు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఇందుకోసం హోర్డింగులు, వాల్ పోస్టర్లు, డోర్ పోస్టర్లు, కరపత్రాల ముద్రణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి (ఎంసీహెచ్), రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ పరిసర ప్రాంతాల్లో అవగాహన హోర్డింగులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కూడా కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు, తలసేమియా ట్రాన్స్‌ఫ్యూజన్ ఇన్‌చార్జ్ కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ, రామ్ టెంకి సాయి తలసేమియా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో తలసేమియా బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవగాహన కార్యక్రమాల అవసరాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వినతిపత్రంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మలు తెలిపారు.

## అక్రమ గోవధపై వెంటనే చర్యలు తీసుకోవాలని వినతి



**జన్నారం,మే25(ప్రజాజ్యోతి)**జన్నారం మండలంలో జరుగుతున్న అక్రమ గోవధలను వెంటనే నిషేధించాలని కోరుతూ సోమవారం గోరక్షక్, హిందూ వాహిని, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో బక్కయ్య కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోమాత హిందూ సమాజానికి ఆరాధ్య దైవమని, హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా జరుగుతున్న అక్రమ గోవధలను అరికట్టి ధర్మాన్ని కాపాడటం ప్రతి హిందువుని బాధ్యత అని అన్నారు.అధికారులు తక్షణమే స్పందించి అక్రమ గోవధ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా సహ సంయోజక్ దండవేణి శ్రీధర్, మండల్ సంయోజక్ చెరుకు ప్రణయ్,బజరంగ్ దళ్ మండల్ ప్రముఖ్ పిల్లి అన్వేష్, కస్తలపురి నరేష్,పందిరి మనీష్,రీశ్వంత్, సాయి సంజయ్,మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలి

గూడెంలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం



దండేపల్లి, మే 25?,ప్రజాజ్యోతి:సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి కోరారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం దండేపల్లి మండల పరిధిలోని గూడెం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్సై తైసినొద్దీన్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది పోలీసు సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.?అనంతరం సీఐ రమణ మూర్తి మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ఉన్న వాహనాలనే వాడాలని, హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు చెప్పరాదని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. మహిళల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని, వేధింపులకు గురైతే తక్షణమే ఫిర్యాదు చేయాలని తెలిపారు. ముఖ్యంగా యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరం గా ఉండాలని, మాదకద్రవ్యాల సమాచారం తెలిస్తే పోలీసులకు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో లక్సెట్టిపేట ఎస్సై సురేష్, జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, సుమారు 100 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళ సంఘం భవనానికి భూమి పూజ



జైపూర్ మే 25 :ప్రజా జ్యోతి జైపూర్ మండల కేంద్రంలో మహిళ సంఘం భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు,మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడేలా నిర్మించనున్న భవనానికి ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. భవనం నిర్మాణం పూర్తయితే మహిళలకు సమావేశాలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూన భాస్కర్,ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రావణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి,మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్,నాయకులు అంబల్ల సంపత్ రెడ్డి,అరిగెల శ్రీనివాస్ గౌడ్,ఇరిగిరాల లింగయ్య,ఏపీఎం సంతోష్ కుమార్,మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు. బజరంగ్ దళ్ మండల్ ప్రముఖ్ పిల్లి అన్వేష్,కస్తలపురి నరేష్,పందిరి మనీష్,దీక్షంత్,సాయి సంజయ్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గని కార్మికుల పెన్షన్ పెరగకపోవడానికి బాధ్యులు ఎవరు....?

**కోల్ పెన్షన్ పథకాన్ని పునర్వ్యవస్థీకరించాలి**
**కనీస పెన్షన్ 10 వేలుకు పెంచాలని డిమాండ్**
**సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు**




**మంచిర్యాల, 25, మే (ప్రజా జ్యోతి):** దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన బొగ్గు గని కార్మికులు తమ జీవితాలను చీకటి గనుల్లో గడిపి దేశానికి వెలుగునిచ్చారని, కానీ పదవీ విరమణ అనంతరం వారు అవమానకర పరిస్థితుల్లో జీవించాల్సి వస్తోందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, సంఘం మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఉత్పత్తి నుండి పరిశ్రమల వరకు ప్రతి రంగం బొగ్గుపైనే ఆధారపడిన కాలంలో గని కార్మికుల కష్టం దేశాభివృద్ధికి మూలస్థంభమైందన్నారు. అయితే పదుల సంవత్సరాలు సేవలందించిన బొగ్గు గని కార్మికులు ప్రస్తుతం నెలకు వెయ్యి రూపాయల నుండి కొద్దిపాటి పెన్షన్‌తోనే జీవించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులు, కుటుంబ అవసరాల నేపథ్యంలో ఈ పెన్షన్‌తో జీవించడం అసాధ్యమైందన్నారు. బొగ్గు గని పెన్షన్ పథకం-1998 అమలులోకి వచ్చినప్పటి నుంచి పెన్షన్‌లో గణనీయమైన సవరణలు జరగలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, బ్యాంకు ఉద్యోగులు, ఇతర రంగాల పెన్షనర్లు తరచుగా డి.ఏ, ఫిట్‌మెంట్, వేతన సంఘాల సిఫార్సుల ద్వారా లాభపడుతుండగా, బొగ్గు గని పెన్షనర్లకు మాత్రం అలాంటి ప్రయోజనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గని కార్మికుల సంక్షేమాన్ని కేవలం ప్రకటనలకే పరిమితం చేసిందనే విమర్శలు వినిపిస్తున్నాయని, ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చినా అమలులో మాత్రం చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ బొగ్గు గని కార్మికుల భవిష్యత్ భద్రత కోసం ఏర్పాటు చేయబడిన సంస్థ అయినప్పటికీ, పెన్షన్ సవరణ విషయంలో సంస్థ పాత్ర ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పెన్షన్ నిధుల నిర్వహణలో పారదర్శకత లేదని, పెన్షన్ పెంపుపై కేంద్ర ప్రభుత్వానికి బలమైన ప్రతిపాదనలు పంపడంలో నిర్లక్ష్యం వహించిందనే విమర్శలు ఉన్నాయని తెలిపారు . కార్మికుల వాస్తవ జీవన పరిస్థితులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో కూడా సంస్థ విఫలమైందన్నారు. ఒకప్పుడు కార్మిక హక్కుల కోసం తీవ్రంగా పోరాడిన కార్మిక సంఘాలు ప్రస్తుతం బలహీనపడిపోయాయనే భావన కార్మికుల్లో ఉందన్నారు. పెన్షన్ పెంపు వంటి కీలక అంశాలపై ఐక్య పోరాటం లేకపోవడం, సంఘాల మధ్య రాజకీయ విభేదాలు పెరగడం వల్ల సమస్య మరింత తీవ్రమైందన్నారు. సంఘాలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే పెన్షన్ అంశాన్ని ప్రస్తావించి, తరువాత మౌనం పాటిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయని పేర్కొన్నారు. నిజమైన ఉద్యమం లేకుండా ప్రభుత్వాలు స్పందించవన్న విషయం చరిత్ర చెబుతోందన్నారు. బొగ్గు గనుల ప్రాంతాల నుండి ఎన్నుకోబడిన ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్లమెంట్, అసెంబ్లీలలో ఈ సమస్యను బలంగా ప్రస్తావించడంలో విఫలమయ్యారని నాయకులు విమర్శించారు. వేలాది మంది పెన్షనర్ల ఓట్లు పొందిన నాయకులు, వారి సమస్యలపై నిర్లక్ష్యం చూపడం బాధాకరమన్నారు. పెరుగుతున్న జీవన వ్యయం కారణంగా వెయ్యి లేదా రెండు వేల రూపాయల పెన్షన్‌తో ఒక వృద్ధుడు నెల గడపడం అసంభవమైందన్నారు. మందులు, పరీక్షలు, ఆస్పత్రి ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయినా పెన్షన్ మాత్రం సంవత్సరాలుగా అదే స్థాయిలో ఉండిపోవడం అన్యాయమన్నారు. కోల్ పెన్షన్ పథకం రూపొందించే సమయంలో భవిష్యత్తులో బొగ్గు గని ఉద్యోగుల వేతనాలు ఎంత వేగంగా పెరుగుతాయి, పదవీ విరమణ పొందే పెన్షనర్ల సంఖ్య ఎంతగా పెరుగుతుంది అనే అంశాలను సరైన విధంగా అంచనా వేయలేదన్నారు. పథకం ప్రారంభంలోనే విరాళాల రేటు చాలా తక్కువగా నిర్ణయించారని తెలిపారు. మూల వేతనం, డి.ఏ పై కేవలం 2.33 శాతం మాత్రమే నిర్ణయించడం వల్ల భారీ సంఖ్యలో ఉన్న పెన్షనర్లకు దీర్ఘకాలం పాటు పెన్షన్ చెల్లించడం, దానిలో పెంపులు ఇవ్వడం ఆర్థికంగా సాధ్యం కాలేదన్నారు. పెన్షన్ సంఘాలు జంతర్ మంతర్ వద్ద నిరసనలు నిర్వహిస్తూ, కోర్టుల్లో న్యాయపోరాటం చేస్తూ ప్రభుత్వం ముందు కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా మొత్తం పథకాన్ని పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా వారు పలు డిమాండ్లు ఉంచారు. కనీస బొగ్గు గని పెన్షన్‌ను కనీసం 10 వేలుకు పెంచాలని, డి.ఏను పెన్షన్‌కు అనుసంధానం చేయాలని, పెన్షన్ సవరణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని, కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని, పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ జరపాలని డిమాండ్ చేశారు. దేశానికి సంపద సృష్టించిన బొగ్గు గని కార్మికులు వృద్ధాప్యంలో అవమానకర పరిస్థితుల్లో జీవించడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. ఈ పరిస్థితికి కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, సిఎంపిఎఫ్ వ్యవస్థ వైఫల్యం, బలహీన కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధుల మౌనం కలిసి బాధ్యులుగా నిలుస్తున్నాయని విమర్శించారు. గనుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పని చేసిన కార్మికులకు గౌరవప్రదమైన జీవితం కల్పించడం ప్రభుత్వం మరియు సమాజం యొక్క నైతిక బాధ్యత అని, " పెన్షన్ దానం కాదని --- అది కార్మికుడి హక్కు" అని ఆళవందార్ వేణు మాధవ్, రాళ్లబండి రాజన్నలు స్పష్టం చేశారు.

## జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు కార్డుల పంపిణీ

**మంచిర్యాల, 25, మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు మీడియా అక్రిడిటేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేరవేయడంలో మీడియా ప్రతినిధులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. బాధ్యతాయుతమైన జర్నలిజంతో



సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని ప్రజలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార శాఖ అధికారులు, మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, వివిధ పత్రికలు , ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ శాఖ కీలక విజ్ఞప్తి

ఎండల తీవ్రతతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది

సహకరించాలని అధికారుల విజ్ఞప్తి

**మంచిర్యాల ,25, మే (ప్రజాజ్యోతి):** గత కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఎండలు కొనసాగుతున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పెరిగిన లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ ట్రిప్ అవుతూ ఫ్యూజులు దెబ్బతింటున్నాయని ఈ పరిస్థితుల్లో వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ విజ్ఞప్తి చేసింది. ప్రత్యేకంగా కరెంటు వెళ్లిపోయి తిరిగి వచ్చిన వెంటనే ఏసీలు ఆన్ చేయవద్దని అధికారులు సూచించారు. లో వోల్టేజ్ కారణంగా ఏసీలు కాలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పవర్ కట్ సమయంలో ఏసీని ఆఫ్‌లో ఉంచి, కరెంటు వచ్చిన తర్వాత కనీసం 30 నిమిషాల వరకు ఆన్ చేయకుండా ఉండాలని తెలిపారు. ఈ వ్యవధిలో ఫ్రిడ్జ్‌లు, ఇన్వర్టర్లు




సాధారణ స్థితికి చేరుకుని ఛార్జింగ్ పూర్తయ్యే అవకాశం ఉంటుందని, ఆ తర్వాత ఏసీలు ఆన్ చేస్తే ప్రమాదం ఉండదన్నారు. అన్ని పరికరాలు ఒకేసారి ఆన్ చేయడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడుతూ అవి కాలిపోయే ప్రమాదం ఉందని, దాంతో రాత్రంతా విద్యుత్ అంతరాయం ఏర్పడే అవకాశముందని అన్నారు. అవసరం లేని చోట విద్యుత్ వినియోగాన్ని తగ్గించి శాఖకు సహకరించాలని అధికారులు కోరారు. విద్యుత్ అంతరాయాలు చోటుచేసుకున్నప్పుడు వినియోగదారులు కొంత ఓర్పు, సహనంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే విద్యుత్ శాఖ సిబ్బంది రాత్రింబవళ్లు తేడా లేకుండా సేవలందిస్తూ లోపాల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అధికారులు తెలిపారు.

# ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో శ్రీరాంపూర్ ఏరియాలో ఉద్యోగుల రక్షణకు ప్రత్యేక చర్యలు

**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పర్యవేక్షణలో విస్తృత ఏర్పాట్లు**

**మంచిర్యాల, 25, మే (ప్రజాజ్యోతి):**రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఉపరితల గనుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య రక్షణకు శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ మునిగంటి శ్రీనివాస్ ఆదేశాలు, పర్యవేక్షణలో శ్రీరాంపూర్ ఓసీపీ, ఇందారం ఓసీ పరిధిలో భారీ స్థాయిలో చలవ పందిరులు, రెస్ట్ షెల్టర్లు, చల్లటి త్రాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేసి ఉద్యోగులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పిస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో కోల్ బెల్ట్ ప్రాంతాల్లో సమ్మర్ ప్రభావం మరింత తీవ్రంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఉపరితల గనులు, ఇతర సర్ఫేస్ విభాగాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు తీవ్ర ఎండలకు గురవుతుండటంతో యాజమాన్యం ముందస్తు చర్యలు చేపట్టింది. ఉత్పత్తికి ఆటంకం కలగకుండా, ఉద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడేలా ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. శ్రీరాంపూర్ ఉపరితల గని, ఇందారం ఓసీలలో పెద్ద సంఖ్యలో చలవ పందిరులు ఏర్పాటు చేశారు. ఇతర షెల్టర్లపై తుంగ, తట్టు సంచులు కప్పి వాటిపై నిరంతరం నీటిని చల్లుతూ వేడి తీవ్రతను తగ్గించే చర్యలు చేపట్టారు. గతంతో పోలిస్తే ఈసారి రెస్ట్ షెల్టర్ల సంఖ్యను రెట్టింపు చేశారు. ప్రతి పని ప్రదేశం, కూడళ్ల వద్ద ఉద్యోగులు విశ్రాంతి తీసుకునేలా ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ప్రతి చలవ పందిరిలో రంజన్లు ఏర్పాటు చేసి చల్లటి త్రాగునీటిని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నారు. ఒక్క శ్రీరాంపూర్ ఓసీపీలోనే దాదాపు 30 రెస్ట్ షెల్టర్లు ఏర్పాటు చేశారు. గతంలో 100 తడకలతో ఏర్పాటు చేసిన పందిళ్లను ఈసారి ఎండల తీవ్రత దృష్ట్యా 300కు పైగా తడకలతో విస్తరించారు. వర్షాకాలంలోనూ వినియోగించుకునేలా నిర్మించిన రేకుల షెడ్లపై తుంగ కప్పి ఉష్ణోగ్రతలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. బ్లాస్టింగ్ ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగుల కోసం ప్రత్యేక టెంపరరీ టెంట్లు కూడా ఏర్పాటు చేశారు. ఇందారం ఓసీలోనూ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సౌకర్యార్థం భారీ సంఖ్యలో తుంగ, తడకలతో చలవ పందిరులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. వేసవి ప్రారంభం నుంచే రెండు ఉపరితల గనుల్లో ఉద్యోగులకు



మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు. భారీ యంత్రాలైన డంపర్లు, షావల్స్‌పై నీటిని స్ప్రే చేస్తూ ఆపరేటర్లపై ఎండ ప్రభావం తగ్గించే చర్యలు తీసుకుంటున్నారు. అలాగే గనుల పరిసరాల్లో స్ప్రింక్లర్ల ద్వారా నీటిని చల్లుతూ ఉష్ణోగ్రతలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు.


**నీటిని చల్లుతూ ఉష్ణోగ్రతలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నాము : ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్......................**

ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ, "సింగరేణి సంస్థకు ఉత్పత్తి, ఉత్పాదకత ఎంత ముఖ్యమో ఉద్యోగుల రక్షణ కూడా అంతే ముఖ్యమైంది. ఈసారి విపరీతమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో గతంతో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో రెస్ట్ షెల్టర్లు ఏర్పాటు చేశాం. 11 వేలకుపైగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉద్యోగుల కోసం అందుబాటులో ఉంచాం. మజ్జిగ ప్యాకెట్లు, చల్లటి నీరు నిరంతరం అందిస్తున్నాం. ఉపరితల గనుల పరిసరాల్లో ఎండ తీవ్రత తగ్గించేలా స్ప్రింక్లర్లతో నీటిని స్ప్రే చేస్తున్నాం. ఎవరైనా ఉద్యోగులు అస్వస్థతకు గురైతే వెంటనే ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. గౌరవ చైర్మన్ ప్రత్యేక చొరవ, డైరెక్టర్ల సూచనలతో చేపడుతున్న చర్యల వల్లే ఉపరితల గనుల్లో ఉద్యోగుల హాజరు, ఉత్పత్తిపై ఎలాంటి ప్రభావం పడటం లేదు" అని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల్లో 'లారీ' కష్టాలు

**మిల్లుల వద్ద 'కటింగ్' పేరుతో రైతుల దోపిడీ**

**డిప్యూటీ తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి**



**దండేపల్లి,మే 25(ప్రజాజ్యోతి):**మండలంలోని ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ జిల్లా, మండల శాఖల ఆదేశాల మేరకు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ చుంచు మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపతి రాజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్ణల కిషన్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో కంటాలు పూర్తయినప్పటికీ అధికారులు సకాలంలో లారీలను పంపించకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,లారీల కోసం ఎదురుచూసి అలసిపోయిన రైతులు, గత్యంతరం లేక ఒక్కో బస్తాకు రూ. 15 నుంచి రూ. 20 వరకు అదనంగా చెల్లించి సొంతంగా లారీలను మాట్లాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు మండిపడ్డారు. తీరా కష్టపడి మిల్లులకు ధాన్యం తరలిస్తే, అక్కడ మిల్లర్లు ఒక్కో బస్తాకు 3 నుండి 4 కిలోల వరకు తరుగు (కటింగ్) పేరుతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అన్నదాతలు పడుతున్న ఈ ఇబ్బందులపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితులకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, రైతులకు జరిగిన నష్టానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంబడి సురేందర్, కన్నెపల్లి మాజీ ఉపసర్పంచి దుమ్మని సత్తయ్య, బోడ సత్యనారాయణ, మండల కార్యదర్శి కమ్మల బుచ్చన్న, బూత్ అధ్యక్షులు పంచెర్పుల సత్యం, పిట్టల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలంటూ యూత్ కాంగ్రెస్ ఆందోళన

**ఆసిఫాబాద్‌లో యూత్ కాంగ్రెస్ ధర్నా.. మోదీ దిష్టిబొమ్మ దహనం**



**ఆసిఫాబాద్, మే 25** (ప్రజా జ్యోతి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతోందని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అలాగే నీట్ పేపర్ లీక్ ఘటనతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు.ఆసిఫాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన నాయకులు అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని, నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ఇనుకొండ కమల్ నాథ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నితిన్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీపతి, ఎలగల సాయి, వాంకిడి మండల యూత్ అధ్యక్షుడు ఉప్పుల కృష్ణతో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్, సీబీఎస్ఈ వివాదాలపై కేంద్రం సమాధానం చెప్పాలి

**విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు**

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ**



**మంచిర్యాల, 25, మే (ప్రజాజ్యోతి):** దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్, సీబీఎస్ఈ పరీక్షల వ్యవహారాల్లో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ సోమవారం తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం రాత్రిబవళ్లు కష్టపడి పరీక్షలు రాస్తుంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం వారి భవిష్యత్తును గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ముఖ్యంగా నీట్ పరీక్షల్లో వరుసగా వెలుగులోకి వస్తున్న పేపర్ లీకులు, అక్రమాలు దేశ విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో తీవ్ర అనుమానాలు కలిగిస్తున్నాయన్నారు. అలాగే సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పరీక్షల రీవ్యాల్యుయేషన్, ఫలితాలపై వస్తున్న ఫిర్యాదులు విద్యార్థులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఇంటర్ సమానమైన పన్నెండో తరగతి విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే విద్యార్థులకు సమాధానం చెప్పాలని, జరిగిన పరిణామాలపై నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూడకుండా దేశ యువత భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు ప్రశ్నిస్తే వారిని విమర్శించడం కాదు, వారి ఆందోళనలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిది అని అన్నారు. "దేశ యువత భవిష్యత్తుతో ఆటలాడే హక్కు ఎవరికీ లేదు. విద్యార్థుల ఆశలు, వారి కుటుంబాల నమ్మకాలను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది" అని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ స్పష్టం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర సేన పార్టీలో చేరనున్న మాజీ మంత్రి బొడ జనార్ధన్

## కవిత నాయకత్వంలోఀటీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేస్తానన్న మాజీ మంత్రి






**మంచిర్యాల, 25, మే (ప్రజాజ్యోతి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో తెలుగు దేశం పార్టీ ఓ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు బొడ జనార్ధన్ మరోసారి యాక్టివ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నట్లు ప్రకటించారు. తాను త్వరలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఏర్పడిన " తెలంగాణ రాష్ట్ర సేన" పార్టీలో చేరబోతున్నట్లు సోమవారం ప్రకటించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడిన ఆయన, గత అసెంబ్లీ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కేసీఆర్ నాయకత్వానికి మద్దతు తెలిపిన తాను, ఇప్పుడు కొత్త రాజకీయ ప్రయాణానికి సిద్ధమయ్యానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ గెలుపు కోసం, అలాగే కవిత ముఖ్యమంత్రి కావడానికి తెలంగాణ వ్యాప్తంగా మెజార్టీ అసెంబ్లీ స్థానాలను గెలుచుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మంచిర్యాల జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే బలంగా ఉందని, కార్మిక రంగంలో ఎస్ఎంఎస్ యూనియన్, దంపర అసోసియేషన్ వంటి సంఘాల మద్దతు కూడా పార్టీకి బలంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ అన్ని వర్గాలను సమన్వయం చేసుకొని కవిత నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని మంచిర్యాల, సిర్పూర్ కాగజ్నగర్ ప్రాంతాలతో పాటు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఉన్న అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కృషి చేస్తానని బొడ జనార్ధన్ స్పష్టం చేశారు. ప్రజల కోసం మరింత సమర్థవంతంగా పనిచేయడం, తెలంగాణ అభివృద్ధికి తన అనుభవాన్ని వినియోగించడం కోసమే తెలంగాణ రాష్ట్ర సేన పార్టీలో చేరుతున్నానని తెలిపారు.

**ఇటీవల హైదరాబాద్లో కల్వకుంట్ల కవితను కలిసిన బొడ జనార్ధన్.....**

ఇటీవల హైదరాబాద్లో కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన సందర్భంగా తాను త్వరలో టీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు సంకేతాలు ఇచ్చిన విషయం తెలిసిందే. నేడు చేసిన ప్రకటనతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై నెలకొన్న అనుమానాలకు తెరపడినట్లైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందిన బొడ జనార్ధన్ రాజకీయ అనుభవం తెలంగాణ రాష్ట్ర సేన పార్టీకి ఎంత వరకు ఉపయోగపడుతుందనేది భవిష్యత్తులో తేలనుంది. చెన్నూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన బొడ జనార్ధన్, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మంత్రివర్గంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. వెనుకబడిన వర్గాల నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇటీవలి కాలంలో ఆయన వివిధ రాజకీయ పరిణామాల నేపథ్యంలో పలువురు నాయకులతో సమావేశాలు నిర్వహించగా, ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర సేన పార్టీలో చేరికపై అధికారిక ప్రకటన చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.

# ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిని సన్మానించిన - ఆడే గజేందర్



**నేరడిగొండ, మే 25 (ప్రజాజ్యోతి)**ఀతెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ( టి పి సి సి ) ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కుర్మే మహేందర్ను బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ఘనంగా సన్మానించారు. సోమవారం నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో మహేందర్కు శాలువా కప్పి, పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తున్న కుర్మే మహేందర్కు రాష్ట్ర స్థాయి పదవి దక్కడం బోథ్ నియోజకవర్గానికి ఎంతో గర్వకారణమన్నారు. భవిష్యత్తులో ఆయన పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా ఎస్సీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి మరింత సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# తూకం ఆలస్యంతో రైతుల నిరసన..

**జాతీయ రహదారిపై ఆందోళన**





**బాసర మే 25(ప్రజా జ్యోతి),** ముక్కజొన్న రైతులు బైంసా నిజామాబాద్ జాతీయ రహదారిపై సోమవారం ఆందోళన చేపట్టారు. మొక్కజొన్న పంట తీసుకువచ్చి మూడు రోజులు అవుతున్న ట్రాక్టర్ల నుండి పంటను తూకం వేయకుండా ట్రాక్టర్ ఖాళీ చేయకుండా ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని రైతులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం అధికారులు స్పందించి పంటను తూకం వేసి కొనుగోలు జరిపేలా చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మూడు రోజులుగా మొక్క జొన్న పంట తీసుకవచ్చిన పంట తూకం వేయకుండా తెచ్చిన ట్రాక్టర్ల లోని పంటను అలాగే ఉంచి తమను ఇబ్బందులకు గురి చేయడం సభవేనా అని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులు స్పందించి పంట కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.స్పందించిన అధికారులు తూకం వేసి పంటను కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. రైతుల ఆందోళనతో గంటపాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.

# కారు-బైక్ ఢీకొని భీకర రోడ్డు ప్రమాదం


## పులికుంట వద్ద హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం





**ఆసిఫాబాద్ మే 25:(ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం పులికుంట సమీపంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జాడి బాబురావు అక్కడికక్కడే మృతిచెందాడు. కారు-బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హెడ్ కానిస్టేబుల్ బాబురావు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బైక్ నుజ్జునుజ్జు కాగా, కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. విండ్ షీల్డ్ అద్దం పగిలిపోవడంతో ప్రమాద తీవ్రత ఎంత భయంకరంగా ఉందో అర్థమవుతోంది. తీవ్ర రక్తస్రావంతో బాబురావు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిజాయితీ, అంకితభావం తో విధులు నిర్వర్తించే బాబురావు మృతితో రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. తోటి సిబ్బంది, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. కారు డ్రైవర్ పరిస్థితి, ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత





**మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**సి ఎం ఎనుముల రేవంత్ రెడ్డి**

**మంచిర్యాల, మే 25 (ప్రజా జ్యోతి):** రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మహిళా సంఘాల సభ్యులతో సిఎం సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ధనసరి అనసూయ తదితరులు పాల్గొన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జరిగిన ఈ సమావేశంలో మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రి వివరించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. సోలార్ ప్లాంట్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి రంగాల్లో మహిళా సంఘాలకు అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు . ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలేమ్ భారత్ పెట్రోలియం, రిలయన్స్ ఇండస్ట్రీస్ రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి సంస్థల సహకారంతో మహిళా స్వయం సహాయక సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణలో అవకాశాలు కల్పిస్తూ ఆర్థిక లబ్ధి చేకూర్చే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు .బ్యాంకు లింకేజీ రుణాలను 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచుతూ దాదాపు 60 వేల 471 కోట్ల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా వడ్డీ లేని రుణాల రూపంలో స్వయం సహాయక సంఘాలకు రూ.1 వేయి 390 కోట్ల మేర మద్దతు అందిస్తున్నామన్నారు. మహిళలు రుణాలను సకాలంలో చెల్లించడం ద్వారా మరింత ఆర్థిక అవకాశాలు పొందడంతో పాటు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల 500 కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మహిళా సంఘాల ద్వారా రైస్ మిల్లులు, గోదాముల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. జిల్లాల వారీగా ప్రభుత్వ భూములను గుర్తించి మహిళా సంఘాల అభివృద్ధికి వినియోగించేందుకు అధికారులు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అలాగే మహిళా శక్తి సూపర్ బజార్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని, నిత్యావసర సరుకులు ఒకే చోట అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ భూములను నామమాత్రపు అద్దెకు మహిళా సంఘాలకు కేటాయించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల అభివృద్ధి

**సర్పంచ్ సుభాష్ ఆధ్వర్యంలో వివో భవన నిర్మాణానికి భూమి పూజ**



**బజార్ హత్నూర్ మే25,(ప్రజా జ్యోతి)**అదిలాబాద్ జిల్లా బజారత్నూర్ మండలంలోని భోసర గ్రామంలో సర్పంచ్ సుభాష్ చేతుల మీదుగా వివో భవనానికి భూమి పూజ సోమవారం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘ సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా నిర్మించబడుతున్న ఈ వివో భవనం మహిళా సంఘాల సమావేశాలు, గ్రామస్థుల చర్చలు సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్య కేంద్రంగా నిలవనుందని సర్పంచ్ సుభాష్ మాట్లాడుతూ తెలిపారు. గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వివో భవనం నిర్మాణం త్వరగా పూర్తై గ్రామ ప్రజలకు ఉపయోగపడాలని ఆకాంక్షిస్తూ, గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జి .మధుకర్, ప్రభాస్ మరి యు గ్రామ పెద్దలు మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## యువతే కాంగ్రెస్‌కు బలం

**: డీసీసీ అధ్యక్షురాలు సుగుణక్క**

**సీఎం రేవంత్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలి: యూత్ కాంగ్రెస్‌కు పిలుపు**



**ఆసిఫాబాద్, మే 25 ప్రజా జ్యోతి** యూత్ కాంగ్రెస్ నాయకులు పార్టీ బలోపేతా నికి కృషి చేయాలని, గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ యువత కాంగ్రెస్ పార్టీకి బలమైన శక్తి అని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీకి మరింత బలం చేకూర్చాలని సూచించారు. యువ నాయకులు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు అండగా నిలవాలని కోరారు. జూన్ 1న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని, భారీ సంఖ్యలో యువత, కార్యకర్తలు పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయ్యేలా ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇరుకుల మంగ, పలువురు కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ఇనుకొండ కమల్ నాథ్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నితిన్, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీపతి, ఎలగల సాయి, రెబ్బెన మండల యూత్ అధ్యక్షుడు పూదరి సాయి, ఆసిఫాబాద్ మండల యూత్ అధ్యక్షుడు వినోద్, ఆసిఫాబాద్ టౌన్ యూత్ అధ్యక్షుడు ప్రభాకర్, వాంకిడి మండల ఇంచార్జ్ యూత్ అధ్యక్షుడు కృష్ణ, గాదిగూడ మండల ఇంచార్జ్ యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్, లింగాపూర్ మండల ఇంచార్జ్ యూత్ అధ్యక్షుడు ముకుంద్‌తో పాటు జిల్లా, నియోజకవర్గ, మండలాల యూత్ నాయకులు పాల్గొన్నారు.

## తేజపూర్ లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సమైక్య భవన నిర్మాణం

– ప్రారంభించిన సర్పంచ్ వసుంధర నవీన్



**నేరేడిగొండ, మే 25 (ప్రజాజ్యోతి):**నేరేడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన వివో (గ్రామ సమైక్య) భవన నిర్మాణ పనులను సోమవారం గ్రామ సర్పంచ్ సింగారి వసుంధర నవీన్ భూమి పూజ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లోని మహిళా సంఘాల బలోపేతానికి, వారు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఈ భవనం ఎంతో దోహదపడుతుందని అన్నారు. నిర్దేశిత గడువులోగా భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పీఓసీసీ విజయలక్ష్మి, వివో కమిటీ సభ్యులు, గ్రామ మహిళా సంఘాల ప్రతినిధులు మరియు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

పోషకాహారంపై అవగాహన కల్పించాలి

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మే 25 (ప్రజా జ్యోతి):**మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కుమార్ దీపక్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా వారోత్సవాలు, పోషకాహార అవగాహన మరియు ఎగ్జిబిషన్ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళలు, గర్భిణీలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పౌష్టికాహారం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. ఎగ్జిబిషన్‌లో స్థానికంగా లభించే తక్కువ ఖర్చుతో కూడిన పౌష్టికాహార పదార్థాలు, మిల్లెట్స్ ఆధారిత ఆహార పదార్థాలు, పోషకాహార వంటకాలను ప్రదర్శించారని తెలిపారు. గర్భిణీలు, బాలింతలకు గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పౌష్టికాహారం, రక్తహీనత నివారణ, సమతుల్య ఆహారం, ఆహార వైవిధ్యం, జంక్ ఫుడ్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఆరోగ్య శాఖ సమన్వయంతో గర్భిణీ స్త్రీలకు అనీమియా పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించినట్లు తెలిపారు. అనంతరం ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై కమ్యూనిటీ న్యూట్రిషన్ ప్రతిజ్ఞ చేయించారు. తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో పౌష్టికాహార వంటకాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా శాఖల అధికారులు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బంది ఆవేదన

24 గంటల పని.. అరకొర జీతం: కలెక్టర్‌కు సీఐటీయూ వినతి



**ఆసిఫాబాద్, మే 25 ప్రజా జ్యోతి** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని మోడల్ స్కూళ్ల హాస్టళ్లలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ మహిళా సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మోడల్ స్కూళ్ల ద్వారా వెనుకబడిన తరగతుల బాలికలకు ప్రభుత్వం నాణ్యమైన విద్యనందిస్తోందని, హాస్టళ్లలో కేర్ టేకర్ కమ్ వార్డెన్, ఏఎన్ఎం, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్స్, వాచ్ వుమెన్, స్వీపర్‌గా మహిళా ఉద్యోగులు 13 సంవత్సరాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారాంతపు సెలవులు, పండుగ సెలవులు లేకుండా 24 గంటలు విధి నిర్వహణ వల్ల అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని, కుటుంబానికి సమయం కేటాయించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పనిభారం అధికంగా ఉందని, పెరిగే ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగట్లేదని, అర్హతలున్నా పదోన్నతులు లేవని, ఉద్యోగ భద్రత లేదని వాపోయారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ మృతదేహాన్ని పరిశీలించిన ఆత్రం సుగుణక్క

మృత హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ

ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ





కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రేబ్బెన మండలం పులికుంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ జాడి బాబురావు మృతదేహాన్ని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సోమవారం పరిశీలించారు. ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి చేరుకున్న ఆమె మృతదేహాన్ని చూసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జాడి బాబురావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని సుగుణక్క పేర్కొన్నారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బంది సమాజానికి అందిస్తున్న సేవలు మరువలేనివని ఆమె కొనియాడారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని సుగుణక్క హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట డీసీసీ ఉపాధ్యక్షుడు తరిఖ్, న్యాయవాది శ్యామ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## అంకుసాపూర్‌లో వీఓ భవన నిర్మాణానికి భూమిపూజ

సర్పంచ్ టేకం గంగారం చేతుల మీదుగా శంకుస్థాపన




**ఆసిఫాబాద్. మే 25 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ మండలంలోని అంకుసాపూర్ గ్రామపంచాయతీలో వీఓ నూతన భవన నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ టేకం గంగారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ దత్తారావు మాట్లాడుతూ గ్రామంలోని మహిళా సంఘాల కార్యకలాపాలకు వీఓ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకమని, ప్రభుత్వ పథకాలను మహిళలకు మరింత చేరువ చేసే విధంగా ఈ భవనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం పొమా, సీసీ భీంరావు, వీఓ అధ్యక్షురాలు దుర్గం కౌసల్య, రేగుంట యశోద, జాడి పొచ్చుబాయి, పోల్కర్ సుశీల, ఉప సర్పంచ్ లక్ష్మీబాయి పోల్కర్, సంఘ సభ్యులు దుర్గం చంద్రకళ, వడ్లూరి కళావతి, దుర్గం సులోచన, ఇగరపు లక్ష్మి, దుర్గం తారాబాయి తదితరులు పాల్గొన్నారు.

## కొరాటి గ్రామంలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క



**కేరమేరి మే 25ప్రజా జ్యోతి** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1న కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా కెరమెరి మండలం కొరారి గ్రామాన్ని సందర్శించనున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఇరుకుల మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లతో కలిసి గ్రామంలో పర్యటన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు మండల నాయకులతో సమావేశమై పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. గ్రామంలోని కొలాం ఆదివాసీల కోసం ప్రభుత్వం నిర్మించిన 28 ఇందిరమ్మ ఇళ్లను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. అలాగే కాగజ్ నగర్ ఎక్స్ రోడ్డులో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు సుగుణక్క పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి వికాసమే మా ధ్యేయం

**ఇతర రాష్ట్రాల్లో కొత్త బొగ్గు బ్లాకులు సాధించాలి**

**కోల్ బెల్ట్ సమస్యలపై ప్రతి 15 రోజులకోసారి సమీక్ష**

**మంత్రులు, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలతో ఉన్నత స్థాయి భేటీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**మంచిర్యాల, 25, మే (ప్రజాజ్యోతి):** ప్రస్తుత పోటీ మార్కెట్లో సింగరేణి సంస్థ నిలదొక్కుకోవాలంటే ఇతర రాష్ట్రాల్లో కొత్త బొగ్గు బ్లాకులను సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సింగరేణి యాజమాన్యానికి దిశానిర్దేశం చేశారు. అత్యంత నాణ్యమైన బొగ్గును మార్కెట్లో విక్రయించే దిశగా సంస్థ చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో సోమవారం నిర్వహించిన సింగరేణి కోల్ బెల్ట్ ఎమ్మెల్యేల సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, ఎనర్జీ స్పెషల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ గౌతమ్ పొట్రు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ఎంపీ బలరాం నాయక్ తో పాటు కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు ప్రేమ్ సాగర్ రావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, గడ్డం వినోద్, విజయ రమణారావు, పాయం వెంకటేశ్వర్లు, గండ్ర సత్యనారాయణ, మట్టా రాగమయి, కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్, కూనంనేని సాంబశివరావు, కోవా లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, సింగరేణి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణకు కొంగు బంగారం గా నిలిచిన సింగరేణి సంస్థతో పాటు కోల్ బెల్ట్ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆ న్నారు. ఎన్నికల సమయంలో పార్టీ తరఫున, ప్రభుత్వం తరఫున కోల్ బెల్ట్ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో తక్కువ వ్యయంతో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి సాధ్యమయ్యే కొత్త బ్లాకులను సింగరేణి సాధించాల్సిన అవసరం ఉందని ఆయన



తెలిపారు. ఈ దిశగా సంస్థ సమగ్ర ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగాలని సూచించారు. గత పదేళ్లలో అధికారంలో ఉన్న ప్రభుత్వం సింగరేణికి కొత్త బ్లాకులు సాధించడంలో విఫలమైందని విమర్శించారు. శతాబ్దం క్రితం ఇల్లందు ప్రాంతంలోని చిన్న గ్రామంలో ప్రారంభమైన సింగరేణిని తమ ప్రభుత్వం ఒడిశా వరకు విస్తరించేలా చర్యలు తీసుకుందన్నారు. కొత్త బ్లాకుల సాధనతో పాటు నాణ్యమైన బొగ్గు విక్రయాల ద్వారా సంస్థ భవిష్యత్తును మరింత బలోపేతం చేయవచ్చన్నారు. ఈ సమీక్ష సమావేశంలో కోల్ బెల్ట్ ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు చేస్తున్న విజ్ఞప్తులు, సూచనలను సింగరేణి యాజమాన్యం పరిగణనలోకి తీసుకోవాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ఇకపై ప్రతి 15 రోజులకు ఒకసారి కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు సమర్పించే వినతులపై తీసుకున్న చర్యలను సమీక్షిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో సింగరేణి కార్మికులు, కోల్ బెల్ట్ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టిందని, భవిష్యత్తులో కూడా సంస్థ అభివృద్ధి, కోల్ బెల్ట్ ప్రాంతాల పురోగతికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి



జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 25 ,( ప్రజాజ్యోతి ).** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, అక్కడ తగిన నివారణ చర్యలు అమలు చేయాలని తెలిపారు. బ్లాక్ స్పాట్స్, జాతీయ రహదారులపై అవసరమైన చోట సూచిక బోర్డులు, వేగ నియంత్రికలు, రేడియం లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కలిగేలా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే రోడ్డు భద్రత వారోత్సవాలు, "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. భారీ



వాహనాల డ్రైవర్లు, పాఠశాల బస్సుల డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. వీరికి ప్రత్యేకంగా రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. త్వరలోనే పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్ బస్సుల సామర్థ్యాలను తనిఖీ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,ఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, డీఎంహెచ్ఓ రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలి

**బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్**



**మంచిర్యాల, 25,మే (ప్రజాజ్యోతి):** యువత క్రీడల్లో ఆసక్తి పెంపొందించుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ నూతన వేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత మత్తు పానీయాలకు దూరంగా ఉండి సమాజంలో మంచి కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. క్రీడల పట్ల మక్కువ పెంచుకుని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టు భావనను పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి, బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్, కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ నాతరి స్వామి, మున్సిపల్ కౌన్సిలర్లు గాలి లత శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు రమేష్, ఢీకొండ రాజలింగు, కంకటి శ్రీనివాస్, క్రీడా అభిమానులు, మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 25 ,( ప్రజాజ్యోతి ).** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, అక్కడ తగిన నివారణ చర్యలు అమలు చేయాలని తెలిపారు. బ్లాక్ స్పాట్స్, జాతీయ రహదారులపై అవసరమైన చోట సూచిక బోర్డులు, వేగ నియంత్రికలు, రేడియం లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కలిగేలా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే రోడ్డు భద్రత వారోత్సవాలు, "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. భారీ వాహనాల డ్రైవర్లు, పాఠశాల బస్సుల డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. వీరికి ప్రత్యేకంగా రోడ్డు భద్రత అంశాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. త్వరలోనే పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్ బస్సుల సామర్థ్యాలను తనిఖీ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ లేకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్,ఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, డీఎంహెచ్ఓ రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జున్ 1న జిల్లాకు సీఎం రేవంత్ సభకు తరలిరండి

ప్రతి పంచాయతీ నుంచి యువత రావాలి: సోషల్ మీడియా కోఆర్డినేటర్ సిరాజ్





**కెరమెరి, మే 25 ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 1న కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు రానున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కెరమెరి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండీ సిరాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా సీఎం నిర్వహించే సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి యువత అధిక సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను సక్సెస్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పెంచికల్పేట్లోని దర్గా పల్లి కు చెందిన పలువు రు, వార్డ్ సభ్యులు, యువకులు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిక

పార్టీ కండవలు కప్పి ఆహ్వానించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండేవిట్టల్





**మే 25,సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)నియోజకవర్గంలోని పెంచికల్ పెట్ మండలం దర్గపల్లి గ్రామానికి చెందిన పలువు రు వార్డుసభ్యులు,యువ కులు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ కాంగ్రెస్ నాయకులు జెట్టి రాజన్న ఆధ్వర్యంలో ఎర్రబోయిన సాయి, శ్రీనివాస్‌తో పాటు గ్రామానికి చెందిన 20 మంది యువకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వా నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంఅమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్య క్రమాలు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పై నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కొత్తగా చేరిన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ రహిత సమాజం కోసం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్



**నేరడిగొండ, మే 25 ( ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో గల వడూర్ సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాలలో సోమవారం హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించా రు. గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నివారణకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా వడూర్ సబ్ సెంటర్ పరిధిలోని అర్హులైన బాలికలకు మొత్తం 18 డోసుల టీకాలను పంపిణీ చేసినట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం లో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ( ఎం.ఎల్.హెచ్.పి ) మౌనిక, ఏఎన్ఎం సంగీత, ఆశా కార్యకర్త సంధ్యతో పాటు వడూర్ సబ్ సెంటర్ పరిధిలోని వైద్య సిబ్బంది పాల్గొని టీకాలు వేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ.. బాలికల ఆరోగ్య రక్షణకు ఈ వ్యాక్సిన్ ఎంతో దోహదపడుతుందని, తల్లిదండ్రులు అవగాహన పెంచుకుని తమ పిల్లలకు తప్పనిసరిగా హెచ్‌పీవీ టీకాలు వేయించాలని కోరారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 25 ,( ప్రజాజ్యోతి ).** జూన్ 02 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, కలెక్టరేట్ లో నిర్వహించే వేడుకల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణం లో నిర్వహించే వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్ ను అందంగా అలంకరించాలని చెప్పారు. ప్రధాన వేదికను పూలతో అందంగా ముస్తాబు చేయాలని వివరించారు. వేడుకల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పక్కాగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రావతరణ వేడుకలకు ప్రోటోకాల్ ప్రకారం అందరినీ ఆహ్వానించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖుల కోసం సరిపడినంత సీటింగ్, తాగునీరు, సౌండ్ సిస్టమ్, షామియానా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలని చెప్పారు. జూన్ 2 ఉదయం నిర్ణీత సమయానిక అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ ఉపేంద్రా రెడ్డి, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 25 ,( ప్రజాజ్యోతి ).** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యల కు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పొన్కల్ లో కరీంనగర్ డైరీ పార్లర్ ప్రారంభం




**మామడ మే 26 ( ప్రజా జ్యోతి)** మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన కరీంనగర్ డైరీ పార్లర్ ను డైరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వర్ రావు సోమవారం ప్రారంబించారు. వినియోదారులకు స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను వినియోగ దారులకు అందించడంలో కరీంనగర్ డైరీ ఎల్లప్పుడూ ముందుంటుందని కరీంనగర్ డైరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వరరావు అన్నారు. నాణ్యమైన పాల ఉత్పత్తులను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత చేరువ చేయడమే డైరీ లక్ష్యమని తెలిపారు. పాల ఉత్పత్తుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరేలా డైరీ సేవలను విస్తరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డైరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వరరావుతో పాటు జగిత్యాల మేనేజర్ లక్ష్మీపతి, సెల్స్ ఏజీఎం విష్ణు, సూపర్‌వైజర్లు రమేష్, చందు, పార్లర్ నిర్వాహకుడు సిలివేరి రాజన్న, గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మీ రాజారెడ్డి, ఎలిగేటి వంశీ కృష్ణ నేత, కొండ్ర రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రజాప్రభుత్వం లక్ష్యం

**బ్యాంకు లింకేజీ, రుణ చెల్లింపులో నిర్మల్ జిల్లా ఆదర్శం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**

**ఒకే రోజు, ఏకకాలంలో 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 25 ,( ప్రజాజ్యోతి ).**రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని సి ఎం రేవంత్ రెడ్డి అన్నారు.సోమవారం సాయంత్రం “ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక” మహిళా వారోత్సవాల్లో భాగంగా మహిళా సంఘాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలను సీఎం వర్చువల్ విధానంలో నిర్వహించారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి.అనసూయ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్రంలోని మహిళల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు (వీవో భవనాలు) శంకుస్థాపనలు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ భవనాలు మహిళా సంఘాల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలుస్తాయని తెలిపారు. రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.60,470 కోట్ల రుణాలు అందించామని, దీని ద్వారా సుమారు 5 లక్షల మంది మహిళలు వ్యాపారవేత్తలుగా మారారని సీఎం వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా, వారిని బస్సుల యజమానులుగా కూడా తీర్చిదిద్దామని అన్నారు. మహిళా సంఘాలు పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు.మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైస్ మిల్లులు, గోదాములు, మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇందుకు అవసరమైన ప్రోత్సాహాన్ని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.బ్యాంకు లింకేజీ, రుణ వసూళ్ల సాధనలో నిర్మల్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని సీఎం ప్రశంసించారు. గ్రామాల్లో పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయం పై మహిళా సంఘాల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం పలు జిల్లాల మహిళా సంఘాలతో సీఎం వర్చువల్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణితో మాట్లాడి, జిల్లాలో మహిళా సంఘాల పనితీరును అభినందించారు. మళ్లీ జిల్లాకు వచ్చినప్పుడు నేరుగా కలుస్తానని తెలిపారు.జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మహిళా సంఘాలకు మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారు.మండల మహిళా సమాఖ్యల ద్వారా పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ అంశాలపై విశేషంగా పనిచేసే మహిళా సమాఖ్యలను గుర్తించి నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గంగామణి, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శబరిమాత వార్షికోత్సవం

-పాల్గొన్న ఏలేటి అశ్విన్ రెడ్డి



**నేరడిగొండ, మే 25 (ప్రజాజ్యోతి ):**మండల కేంద్రంలో నిర్వహించిన శబరిమాత వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఈ ఉత్సవాలకు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అశ్విన్ రెడ్డి శబరిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, భక్తులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏలేటి అశ్విన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని, భక్తి శ్రద్ధలతో సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతియుత వాతావరణానికి దోహదపడతాయన్నారు.శబరిమాత వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏలేటి అశ్విన్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందన సన్మాన జ్ఞాపిక ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అవగాహన లేకుండా మున్సిపల్ సమావేశాలు ఏంటి కాంగ్రెస్ కౌన్సిలర్ల ఆరోపణ

చైర్మన్ సమన్వయంగా మెలగాలి



**ఖానాపూర్ మే 25( ప్రజా జ్యోతి)** ఖానాపూర్ మున్సిపల్ సమావేశం అవగాహన లేకుండా నిర్వహించడం సరికాదని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అన్నారు ఎజెండా అంశాలు లేకుండా సమావేశం నిర్వహించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు మున్సిపల్ కమిషనర్ లేకుండా సమావేశం నిర్వహిస్తే సమస్య ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరైనది కాదని ఈ విషయంలో చైర్మన్ సమన్వయంగా మెలగాలని అన్నారు మున్సిపల్ అభివృద్ధి కోసం అన్ని విధాలుగా తాము సహకరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు మున్సిపల్ కార్యకలాపాల విషయంలో జాప్యం చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని అన్నారు అవగాహన లేకపోతే అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పడకొండవ వార్డు కౌన్సిలర్ రాజుర సత్యం, ఏడో వాడు కౌన్సిలర్ నిమ్మల రమేష్, రెండో వార్డ్ కౌన్సిలర్ గొర్రె తిరుమల భర్త పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగొర్రె గంగాధర్, సాజిదా బేగం జమాల్ ఖురేషీ, లు పాల్గొన్నారు

# ప్రజా ఫిర్యాదులను త్వరిత గతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా,**



**ఆదిలాబాద్ బ్యూరో, మే 25, (ప్రజా జ్యోతి)** జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రజా ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరి ష్కరించడం అధికారుల ప్రాధాన్య కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కా ర్యక్రమంలో భాగంగా జిల్లాలో ని వివిధ ప్రాంతాల నుంచి వ చ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇం దిరమ్మ ఇళ్ల మంజూరు, సా మాజిక భద్రతా పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 91 ఫి ర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సమస్యల పరిష్కారా నికి సంబంధిత శాఖల అధి కారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందే ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో ప ర్యవేక్షణ చేపట్టి, సమస్యలపై తీసుకున్న చర్యల నివేదికలను సమయానికి పోర్టల్‌లో న మోదు చేయాలని సూచించా రు.పదేపదే ఒకే సమస్యపై ఫి ర్యాదులు రావడం జరుగకుండా శాశ్వత పరిష్కారాలపై దృ ష్టి సారించాలని, అప్పీల్ కేసు లను రెండు నుంచి మూడు రో జుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు కలెక్టర్ ఆర్ఎస్ చిత్రు, డిఆర్ఓ స్రవంతి, డీఆర్‌డీవో రవీందర్,డీ ఏం డబ్ల్యూ ఓ కలీం, తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం బస్తాలు తరలించడంలో అధికారుల జాప్యం

**ఆగ్రహించిన రైతులు రోడ్డెక్కి ఆందోళన**

**ధాన్యం బస్తాలు తరలించేందు కు లారీలు పంపించండిమేడం**

**ఆరై కాళ్ళు మొక్కిన రైతు**



**కడెం, మే 25 (ప్రజాజ్యోతి):**తూకం అయిన ధాన్యం బస్తాలను తరలించడంలో అధికారులు చేస్తున్న జాప్యానికి రైతన్న ఆగ్రహం వ్యక్తం చేశాడు. కొంతకాలంగా వేచి చూసిన రైతులు ఇక త్వ రలో వర్షాకాలం ప్రారంభం కానున్న దృష్ట్యా దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతూ రో డ్డెక్కి ఆందోళనకు దిగారు. తూకం చేసిన ధాన్యం ఎక్కడి కక్కడే నిల్వలు ఉండిపోవడం వల్ల రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.తూకం చేసిన ధాన్యం తరలించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో ఇక చేసేది ఏమీ లేక రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. రోడ్డెక్కి రోడ్డు పై బైఠాయించి ఆందోళన కు దిగారు. పెద్ద ఎత్తున రాస్తా రోకో చేసి ప్రభుత్వానికి వ్యతి రేకంగా నినాదాలు చేశారు. చివరికి ధాన్యం తరలించేందుకు లారీలు పంపించండి మేడం అంటూ రైతులు ఆర్ ఐ కాళ్లు మొక్కారు.నిర్మల్ జిల్లా కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్ చౌరస్తా వద్ద లింగాపూర్, సా రంగాపూర్, మాసాయి పేట్ మూడు గ్రామాల రైతులు నిర్మల్ - మంచిర్యాల ప్రధాన రహదారి పై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ధర్నా స్థలం వద్ద ఓ రైతు స్పృహ కోల్పోవడంతో వెంటనే హుటా హుటిన రైతులు కడెం ఆసుప త్రికి తరలించారు. అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడు తున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ ఐ) శారద కాళ్లు మీద పడి రైతులు ధాన్యం లారీలు పంపించండి అని ప్రాధేయ పడ్డారు. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు లారీలు రాక అధికారులు ధాన్యం తూకం వేయక పోవడం, తూకం వేసిన ధాన్యాన్ని తరలించక పోవడంలో జాప్యం చేయడంతో రైతులు గత నెల రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడి కాపులు కాస్తూ విరక్తి చెంది ఒక్కసారిగా ఆందోళన బాట పట్టారు. ధాన్యం కొను గోలు కేంద్రాల వద్ద మయిచ్చర్ వచ్చిన ధాన్యం మక్కలు, వరి ధాన్యం కొనుగోలు, తరలింపులో అధికారుల జాప్యం చేస్తు న్నారని నిరసన వ్యక్తం చేస్తూ నచ్చన్ ఎల్లాపూర్ వద్ద నున్న నిర్మల్, మంచిర్యాల ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి ధర్నా రాస్తారోకో చేపట్టారు.దాదాపు గంటకు పైగా ప్రధాన ర హదారిపై రైతులు బైఠాయించి ధర్నా చేపట్టడం తో లింగాపూ ర్ గ్రామానికి చెందిన రైతు ఆ కుల నరసయ్య స్పృహకోల్పో యాడు. వెంటనే కొందరు రైతు లు రైతు నర్సయ్యను హుటా హుటిన నా ప్రైవేటు వాహనం లో కడెం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరు కొని రైతులతో మాట్లాడుతున్న సిఐ అజయ్, ఆర్ ఐ శారద, ఎస్సై రాహుల్‌లు మెప్పించి నప్పటికీ రైతులు ఏమాత్రం విన లేకపోయారు. రైతులతో మాట్లాడుతున్న ఆర్ఐ శారద కాళ్ళ మీద పడి ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని రైతులు ప్రాధేయ పడ్డారు. ఒక పక్క వర్షాలు వస్తున్నాయని, ఆయినా ఏ ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూడా 10% కూడా ధాన్యం తరలింపు జరగలేదని, వెంటనే ధాన్యం తరలింపు వేగవంతం చేస్తామని గంటలోపు కలెక్టర్ వచ్చి ధాన్యం త రలింపు పై పక్కా హామీ ఇచ్చి ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన మరింతఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

**ఖానాపూర్ మండల**

**అధ్యక్షుడు జంగిలి శంకర్**



**ఖానాపూర్ మే 25 (ప్రజాజ్యోతి )** ఖానాపూర్ శాసనసభ్యులు నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగిలి శంకర్ ఆధ్వర్యంలో సోమవారం బాదనకుర్తి గ్రామంలో బూత్ లెవెల్ కమిటీల కార్యక్రమం నిర్వహించారుఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్టం చేయడంలో బూత్ కమిటీల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను గుర్తించి పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. అలాగే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి బూత్‌లో సమర్థవంతమైన కమిటీలు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. యువత పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని మండల పార్టీ అధ్యక్షులు జంగిల్ శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో భాను పూర్తి గ్రామస్థాయి బూతులేవల్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో పాటు ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం ఉడల రాజన్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగా నరసయ్య గాజుల గంగన్న మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్ష కార్యదర్శులు రాజు నాయక్ పోలంపల్లి సచిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం సర్పంచుల మండల ఫోరమ్ అధ్యక్షులు రాజేందర్ నాయక్ తర్లపాడు సర్పంచ్ పోలంపల్లి సచిన్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగ నరసయ్య బాదన కుర్తి మాజీ ఎంపిటిసి గుడాల రాజన్న పిఎసిఎస్ డైరెక్టర్ గాజుల గంగన్న తర్లపాడు ఉప సర్పంచ్ నరసయ్య బాలసంకుల రాజేందర్ బాదన కుర్తి గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సాగర్ ఆత్మ కమిటీ డైరెక్టర్ బొడ్డు నరసయ్య సీనియర్ నాయకులు మాసుల లక్ష్మీరాజం మాజీ ఉపసర్పంచ్ బీమ్ రాజ్ యూత్ అధ్యక్షులు హరి డాక్టర్ నరసయ్య జెట్టి రమేష్ దొంతుల గంగరాజాం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రైల్వే ఉద్యోగి కుటుంబానికి రూ. కోటి చెక్కు అందజేత




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,మే 25 ,( ప్రజాజ్యోతి ).** రైల్వే శాఖలో విధులు నిర్వహిస్తున్న రాజేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సాలరీ ప్యాకేజ్ కింద ఆయన కుటుంబానికి రూ.1 కోటి బీమా క్లెయిమ్ చెక్కును అధికారులు సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా మృతుడు రాజేందర్ తండ్రి దేవత ప్రేమ్‌సాగర్ నామినీకి చెక్కును అందించారు. ఏప్రిల్ 24, 2026న చించోలి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజేందర్ మృతి చెందినట్లు తెలిపారు. ఎస్‌బీఐ సాలరీ ప్యాకేజ్‌లో భాగంగా ఉద్యోగులకు అందిస్తున్న బీమా సదుపాయాల ద్వారా ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకుండానే కుటుంబ సభ్యులకు రూ.1 కోటి వరకు బీమా రక్షణ లభిస్తోందని అధికారులు వివరించారు. ఈ పథకం ఆపదలో ఉన్న కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందన్నారు. చెక్కు అందజేసిన కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ సాంనయ్య, ఆర్‌బీఓ ఆదిలాబాద్ ప్రాంతీయ మేనేజర్ రంజన్ కుమార్, ఎల్‌డీఎం బి. రామ్ గోపాల్, చీఫ్ మేనేజర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా కు యువవజన సంఘాల కృత జ్ఞతలు



**ఆదిలాబాద్ టౌన్, మే 25, (ప్రజా జ్యోతి)**గత 20 న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జాబ్ మేళా విజయ వంతం చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షీషా కి యు వత, యువజన సంఘాల పక్షాన జిల్లా అధ్యక్షులు బాల శంకర్ కృష్ణ అభినందనలు తెలిపారు. గత 20న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని చిల్కూరి గార్డెన్‌లో హైదరాబాద్ నుండి ఎన్నో కంపినీలను రప్పించి జాబ్ మేళా ద్వారా జిల్లాలోని 80 శాతం నిరుద్యోగ యువతకు ఉద్యోగావకా శాలు కల్పిం చారని, మొన్నటి జాబ్ మేళా ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించిన జిల్లా కలెక్టర్ రాజార్షి షాని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ తో పాటు ఆదిలాబాద్ లో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని, ముఖ్యంగా వెను కబడిన ఆదిలాబాద్ జిల్లా కు మీరు చేస్తు న్న సేవలు మరువలేని వని కొనియాడారు. జాతీయ స్థాయిలో ఎన్నో పురస్కారాలు అందుకొని జిల్లాకు వన్నె తెచ్చిన మీ సేవలు అలాగే కొన సాగించాలని కోరారు.

## జూన్ 2 వరకు ఇందిరమ్మ ఇండ్లలో గృహప్రవేశాలు చేయాలి

సర్పంచ్ కార్యదర్శుల సమావేశం



ఖానాపూర్ మే 25 (ప్రజా జ్యోతి) ఖానాపూర్ మండలంలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలు లబ్ధిదారులు జూన్ 2వరకు పూర్తి చేసి గృహప్రవేశాలు చేయాలని మండల పరిషత్ అధికారి చిక్యాల రత్నాకర్‌రావు అన్నారు మండల పరిషత్ కార్యాలయం లో సోమవారం సర్పంచ్లు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామపంచాయత టాక్సు పూర్తిస్థాయిలో వసూలు చేయాలని రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుద్ధ పనులకు పూర్తి ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ప్రజలకు ఇబ్బందులు కలక్కుండా మెలగాలని అన్నారు ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారితో పాటు సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

## జూన్ 1న జిల్లావ్యాప్తంగా 'ఇందిరమ్మ ఇళ్ల' సామూహిక గృ హప్రవేశాలు

కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్ బ్యూరో, మే 25 (ప్రజా జ్యోతి) రాబోయే జూన్ 1వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీ వార్డులలో ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమాన్ని ఘనంగా ని ర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. సో మవారం క్యాంపు కార్యాల యం నుండి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, సామూ హిక గృహప్రవేశాలు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల సర్వే,ని లిచిపోయిన ఇళ్ల పనులపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో గృహప్రవేశాల కింద మొత్తం 2,773 ఇళ్ల లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 1,708 ఇళ్లు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన 1,065 ఇళ్లను యుద్ధ ప్రాతి పదికన పూర్తి చేయాలని హౌసింగ్, మండల అధికారులను ఆదేశించారు. జూన్ 1వ తేదీ నాటికి ఈ ఇళ్లన్నింటినీ సిద్ధం చేసి, లబ్ధిదారులతో ఉమ్మడిగా గృహప్రవేశాలు చేయించేలా అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మరోవైపు రెండో విడ త ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో భాగంగా జిల్లాలోని అర్హులైన లబ్ధిదారుల గుడిసెల వివరాలను జెజిటెడ్ అధి కారుల ద్వారా క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సర్వే చేయిం చాలని ఆదేశించారు. ఈ సర్వే నివేదికలను నేరుగా కలెక్టర్ లాగిన్‌కు పంపాలని, తద్వారా వీలైనంత త్వరగా వీటికి శాంక్షన్ ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. వీటితో పాటు జిల్లాలో ఇంకా పనులు ప్రారంభం కాని ఇళ్లు ఉంటే, వెంటనే లబ్ధి దారులతో మాట్లాడి పనులు ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదే శించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ నోడల్ అధికారి శంకర్, ఈడియం రవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వ ర్ గౌడ్, ఎంపీడీఓలు, ఈఈలు, ఏఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో లో పలువురిని పరామర్శించిన ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఖానాపూర్ మే 25( ప్రజా జ్యోతి ) ఖానాపూర్ నియోజకవర్గం లోని పలువురు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి లో పొందుతున్న బాధితులను నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సోమవారం స్వయంగా ఆస్పత్రికి వెళ్లి పరమశించారు ఆసిఫాబాద జిల్లా జైనూర్ మండలం, అడ్డేసారా సర్పంచ్ పంద్ర షేకు ఉట్నూర్ మండలానికి చెందిన ఉపాధి హామీ ఉద్యోగి, లింగాపూర్ మండలం మామిడిపల్లిలో విధులు నిర్వహించి తిరుగు ప్రయాణంలో ప్రమాదవ శాత్తు గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలపాలై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు అలాగే ఉట్నూర్ మండలం నాగపూర్‌కి చెందిన సూర్యకిరణ్ జీబీఎస్ వ్యాధితో బాధపడుతున విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్స్ ఆసుపత్రిలో పరామర్శించి ,ధైర్యంగా ఉండాలని,ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాధ్యత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తమ న్యాయమైన సమస్యలను పరిష్క రించి,జీవో 58 ను సవరించాలని డిమాండ్ చేస్తూ

బెజ్జూర్ మండలంలో దివ్య జ్యోతి మండల సమైక్య వద్ద ఐకెపి వివో ఏలు చెవులో పువ్వులతో నిరసన




మే 25, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియోజకవర్గంలోని బెజ్జూర్ మండల కేంద్రంలో చెవిలో పువ్వులతో ఐకెపి వివోఏ లు నిరసన,తమ న్యాయ మైన సమస్యలను పరిష్కరించి, జీవో 58 సవరించా లని డిమాండ్ చేస్తూ బెజ్జూర్ మండల కేంద్రం లోని దివ్య జ్యోతి మండల సమైక్య వద్ద ఐకెపి వివోఏలు చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వివోఏలకు కనీస వేతనం అమలు చేస్తూ హెచ్ఆర్ వర్తింపచేయాలని సెల్ఫ్ సిబ్బందిగా గుర్తించాలని అన్నారు. అర్హతలను బట్టి వివోఏలకు పదోన్నతులు ఇవ్వాలని ఇండ్లు ఇంటి స్థలాలతో పాటు వివోఏ లా కుటుంబ సభ్యులకు ప్రమాద అదేవిధంగా సహజ భీమా కల్పిస్తూ ఆరోగ్య సంబంధిత చికిత్స నిమిత్తం 20 లక్షల ఆరోగ్యశ్రీ వర్తింప చేయా లని అన్నారు.విధులు నిర్వహిస్తూ మృతి చెందిన వివోఏల కుటుంబ సభ్యు ల్లో ఉద్యోగాలు కల్పించాలని అన్నారు.

## ఉపాధి హామీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్



మే 25 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాసిర్పూర్(టి) మండలంలోని వేంపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఆయన పరిశీలించి వివరాలు కోరగా ముంజం ఆనంద్ కుమార్‌తో కార్మికులు మాట్లాడుతూ..ఉపాధి హామీ పథకం కింద ఎంత కష్టపడి పని చేసినప్పటికీ రోజుకు కనీస వేతనం 307/మూడు వందల ఏడు రూపాయలు కూడా అందడం లేదని వాపోయారు. శ్రమకు మించి కూలి లభించడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారని ముంజం ఆనంద్ కుమార్ తెలిపారు. అనంతరం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ...పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముంజం ఆనంద్ కుమార్ తో చెప్పడంతో ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.రేపు పంపిస్తాం అని చెబుతున్నారే తప్ప మంచినీటి సౌకర్యం కల్పించడం లేదని పంచాయతీ కార్యదర్శి కూడా తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫోటో విధానం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. ఒక ఫోటో కోసం పది నిమిషా లకుపైగా నిలబడినా ఫోటో నమోదు కాకపోవ డం వల్ల కార్మికులు ఆందోళన చెందుతున్నా రని అన్నారు.ఒక కార్మికు డు ఫోటో రావాలనే ఉద్దే శంతో తలకు కట్టుకున్న రుమాలుకూడా తొలగించి నప్పటికీ ఫోటో నమోదు కాలేదని, దీంతో తాను చేసిన పనికి కూలి డబ్బులు వస్తాయో లేదో అనే భయంతో బాధపడు తున్నట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ఫోటో విధానం వల్ల లక్ష లాది మంది ఉపాధి హామీ కార్మికులు ఉపాధి కోల్పో యే ప్రమాదం ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే రెండు ఫోటోల విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలను విరమించుకో వాలని, కార్మికులకు కొలతలతో సంబంధం లేకుండా పూర్తి రోజు కూలి చెల్లించే విధానం అమలు చేయాలని అన్నారు. గ్రామీణ కూలీల వేతనాలను పెంచాలని, ఉపాధి హామీ పథకాన్ని రక్షించేం దుకు ఐక్య పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం పెంచాలని,రెండు ఫోటోల విధానాన్ని వెంటనే రద్దు చేయాలని పని ప్రదేశాల్లో తాగునీరు,నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని,కొలతలతో సంబంధం లేకుండా పూర్తి రోజు కూలి చెల్లించాలని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి కార్మికుల హక్కులను రక్షించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో బొర్కుట్ రాజేందర్ సునీత రాజన్న ఉపాధి హామీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకే సంఘాలు



ఇచ్చోడ, మే 25, (ప్రజా జ్యోతి) మహిళలు మార్థికంగా ఎదిగేందుకు సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందని గుండి వాగు సర్పంచ్ గైక్వాడ్ శోభారాణి అన్నారు. ఇచ్చోడ మండలం గుండి వాగు గ్రామంలో వీవో భవణ నిర్మాణానికి సర్పంచ్ గాయక్వాడ్ శోభా రాణి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు, సమస్యల పరిష్కారానికి మహిళా సంఘాలు దోహద పడతాయని తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ము ఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాయ క్వాడ్ గణపతి, వీవోలు పులాజి బాబా, లక్ష్మిబాయి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గింజను కొంటా నన్న హామీని రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలి

**సిర్పూర్ (టి) ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ రావు, భాజపా పార్టీ నాయకులతో కలిసి రాష్ట్ర అధ్యక్షులు రామ చంద్ర రావు డిమాండ్**



మే 25 సిర్పూర్(టి) నియోజకవర్గం ప్రతినిధి ప్రజాజ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ రావు, బిజెపి పార్టీ నాయకులు, ఎంపీలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లతో కలిసి బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామ చంద్ర రావు వికారాబాద్ జిల్లా పరిగి నియోజక వర్గంలోని కుల్కచర్ల, గజ్వేల్ పట్టణంలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి తన హామీని నిలబెట్టు కోవాలని అన్నారు. ప్రతి గింజను కొంటానని వరంగల్ డిక్లరేషన్ లో హామీ ఇచ్చి యాసంగిలో ఇప్పటివరకు సగంవడ్లని కూడా సేకరించకపోవడం దారుణమని అన్నారు. భారతీయ జనతా పార్టీ రైతులకు అండగా నిలిచి ప్రతి గింజ కొనుగోలు చేసే వరకు పోరాటం చేపడుతుందని తెలిపారు. సిర్పూర్(టి) శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడు తూ... వారం రోజుల్లో రుతుపవనాలు రానున్న సందర్భంగా 35 శాతం మాత్రమే వడ్ల కొనుగోళ్లు పూర్తయ్యాయని, వర్షాలు రాగానే రైతులు తక్కువ ధరకు వడ్లను దళారులకు అమ్ముకోవాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. కేంద్రం మద్దతు ధర ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్లను సజావుగా జరిపించలేని అసమర్థ స్థితికి చేరుకుందని అన్నారు. ప్రతి జిల్లాకు ఇన్చార్జ్ మంత్రి ఉన్నారని, జిల్లా ఇన్చార్జి మంత్రులు వారం రోజులు తమతమ జిల్లాల్లో ఉండి వడ్ల కొను గోళ్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసన మండలి పక్షనేత, ఎవిఎన్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు డి.కె. అరుణ, ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రఘునందన్ రావు, శాసన సభ్యులు రామా రావు పాటిల్, పైడి రాకేష్ రెడ్డి, కాటిపల్లి వెంకట రమణ రెడ్డి, ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా, శాసన మండలి సభ్యులు అంజి రెడ్డి, మల్క కొముర య్య, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నో సంవత్సరాలుగా యువత, విద్యార్థులు, క్రీడాకారులు, ఉద్యోగస్తులు, సాధారణ ప్రజలకు

**పరుగు, వ్యాయామం, క్రికెట్, వాలీబాల్, అథ్లెటి క్స్, సాధన లాంటి ఎన్నో క్రీడాల కొరకు ఉపయో గపడుతూ వచ్చిన జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ మైదానం**

**పోలీస్ ల అధీనంలో ఉండి ప్రజలకు అందు బాటులో లేకపోవడం అత్యంత బాధాకరం:**

**మున్సిపాల్ కౌన్సిల్ సమా వేశంలో ఈఅంశాన్ని అత్యంత ధాన్యతగా ప్రస్తావించి:**

**సంబంధిత అధికారులతో చర్చించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ మైదానాన్ని తిరిగి ప్రజలు వినియోగించే విధంగా చూడాలి:**

**జిల్లా అడిషనల్ కలెక్టర్ డేవిడ్ కు వినతి పత్రం సమర్పించిన డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ క్రీడా మైదాన పరిరక్షణ సమితి:**

మే 25 సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ మైదానం ఎన్నో సంవత్సరాల నుండి యువత, విద్యార్థులు, క్రీడాకారులు, ఉద్యోగస్తులు, సాధారణ ప్రజలకు పరుగు, వ్యాయమం, క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ సాధన లాంటి ఎన్నో క్రీడాల కోసం ప్రజలకు ఉపయోగ పడుతూ వచ్చిన పోలీస్ పరేడ్ గ్రౌండ్ మైదానం పోలీసుల అధీనంలో ఉండి ప్రజలకు అందుబాటులో లేకపోవ డం అత్యంత బాధాకరం మున్సిపల్ కౌన్సిల్ సమా వేశంలో ఈ అంశాన్ని అత్యంత ప్రధానిగా ప్రస్తా వించి సంబంధిత అధికారులతో చర్చించి పోలీసు ల అధీనంలోఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండ్ మైదానాన్ని తిరిగి ప్రజలకు వినియో గించే విధంగా చూడాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ డేవిడ్ కు డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, క్రీడా మైదాన పరిరక్షణసమితి ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. అనంత రం డివైఎఫ్ఐ జిల్లా ప్రధా న కార్యదర్శి గోడిసెల కార్తీక్ ఏఐవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి, క్రీడా మైదాన పరిరక్షణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బుజాడి కుమార్, ఎదునూరి సాయి కృష్ణ, కోశాధికారి సిద్దిక్ హాఫీజ్ మాట్లాడుతూ... జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ అధీనంలో ఉన్న క్రీడా మైదానం ఎన్నో సంవత్సరాలుగా యువత విద్యార్థులు, క్రీడాకారులు, ఉద్యోగార్థులు సాధారణ ప్రజలకు ఉపయోగపడు తూ వచ్చిందని అన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో వందలాది మంది యువకులు ఈ మైదానంలో పరుగు, వ్యాయామం క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి క్రీడల సాధన నిర్వ హించేవారని తెలిపారు. ఈ మైదానం ద్వారా అనేక మంది యువకులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచి ఉద్యోగ అవకాశాలు కూడాపొందా రని అన్నారు. ప్రస్తుతం ఈ మైదానం పూర్తిగా ప్రజలకు అందుబాటులో లేక పోవడం అత్యంత బాధా కరమని అన్నారు. సరైన క్రీడామైదానం లేకయువత రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో సాధన చేయాల్సిన పరిస్థి తి ఏర్పడిందని అన్నారు. ఇది ఒకవైపు యువత భద్రతకు ప్రమాదకరమైతే, మరోవైపు క్రీడా అభివృద్ధి కి తీవ్ర ఆటంకంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తు న్నామని చెబుతూ మరో వైపు ఈ క్రీడ మైదానాన్ని పోలీసులు అధీనంలో ఉంచి, ప్రజలకు క్రీడలకు దూరం చేయడం ఏమిట ని ప్రశ్నించారు. ఇప్పటికే ఉన్న క్రీడా మైదానాలను ప్రజలకు దూరం చేయడం సరైన నిర్ణయం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడలకు కీలక పాత్ర ఉన్న నేటి యువత. మత్తు పదార్థాలు, చెడు అలవాట్లు అసాంఘిక



కార్యకలాపాల నుండి దూరంగా ఉంచేది క్రీడలే. ముఖ్యంగా గ్రామీణమధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువకులకు ప్రత్యేక క్రీడా అకాడమీలు లేదా ప్రైవేట్ గ్రౌండ్లు అందుబాటులో ఉండవు. ప్రభుత్వానికి చెందిన ఈ మైదానమే వారికి ఒకే ఒక ఆశ్రయం. కాబట్టి పోలీస్ పరేడ్ గ్రౌండ్ పరిధిలోఉన్న ఈ స్థలం ప్రజా ప్రయోజ నాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతై నా ఉందని అన్నారు. క్రీడాకారులకు, ఉద్యోగార్థు లకు పరుగు ట్రాక్, తాగు నీరు, లైటింగ్, కూర్చునే సదుపాయాలు వంటి కనీస వసతులు కల్పిస్తే జిల్లాలో క్రీడా వాతావర ణం మరింత బలపడు తుందని అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమా వేశంలో ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో ప్రస్తావించి, సంబంధిత అధికారులతో చర్చించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ అధీ నంలో ఉన్న క్రీడా మైదానా న్ని తిరిగి ప్రజలకు, యువతకు, క్రీడాకారులకుఅందు బాటులోకి తీసుకురావడా నికి చర్యలు తీసుకోవా లని వినతి పత్రంలో కోరారు. అదేవిధంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్ అధీనంలో ఉన్న క్రీడా మైదానాన్ని వెంటనే ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో యువతకు క్రీడల సాధనకు అనుమ తి ఇవ్వాలని అన్నారు. పరుగు ట్రాక్, తాగునీరు, లైటింగ్, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక సౌకర్యా లు ఏర్పాటు చేయాలని జిల్లా స్థాయి క్రీడా అభివృ ద్ధికి ప్రత్యేక కార్యాచరణ పొందించాలని అన్నారు. క్రీడాకారులు, ప్రజా సంఘా లతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని సూచించారు. యువత భవిష్యత్తు, ప్రజా ఆరోగ్యం మరియు క్రీడా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఈ అంశంపై తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరు చిరంజీవి, క్రీడామైదాన పరిరక్షణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు బుజాడి కుమార్, ఎదునూరి సాయి కృష్ణ, కోశాధికారి సిధిక్ హాఫీజ్. తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబం ను పరామర్శించిన నీలాదేవి

ఇచ్చోడ, మే 25 (ప్రజా జ్యోతి) ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు కుంట సాగర్ రెడ్డి తల్లి కుంట ఆశమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలో పెద్ద కర్మ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి తెలంగాణా రాష్ట్ర ఎస్సి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి హాజరై ఆశమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు



సర్పేసోంబాయి, భాస్కర్ రెడ్డిచారి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా స్వయం సహాయక సంఘ సభ్యుల సమావేశాలు, నిర్వహణ,ఇతర లావా దేవిల కోసం

ఉపాధి హామీ నిధుల తో మంజూరైన గ్రామ సంఘ భవనానికి

ఏపీవో రాజన్న,ఏపీఎం

మోహన్ దాస్,పంచాయతీ సెక్రెటరీ వైకుంఠం, మహిళా సంఘాలతో కలిసి:

భూమి పూజ చేసిన బెజ్జూర్ సర్పంచ్ దుర్గం సరోజ,తిరుపతి:



మే 25, సిర్పూర్ టి నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియో జకవర్గం లోని బెజ్జూర్ మండల కేంద్రంలో గ్రామ సంఘ భవనానికి సర్పంచ్ దుర్గం సరోజా తిరుపతి భూమి పూజ చేసినట్లు తెలిపారు.మహిళా స్వయం సహాయక సంఘ సభ్యుల సమావేశాలు పుస్తక నిర్వహణ ఇతర లావాదేవీల కోసం ఉపాధి హామీ నిధులతో మంజూరైన ఈ భవనానికి అధికారులు ఏపీవో రాజన్న ఏపీఎం మోహన్ దాస్ పంచాయతీ కార్యదర్శి వైకుంఠం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి భూమి పూజ చేసినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందు భవనాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన నిధులను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యతతో భవనాన్ని నిర్మించాలని అన్నారు.

## అంగన్వాడీ కేంద్రం ద్వారా ఎలుక పల్లి గ్రామపంచాయతీ పరిధిలో బాలికలకు పోషకాహార కిట్లను పంపిణీ చేసిన సర్పంచ్ భక్తు రాంచందర్



మే 25, సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి)నియో జకవర్గంలోని పెంచికల్పేట్ మండలం ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ భక్తు రామచంద్ర ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం ద్వారా బాలికలకు పోష కాహార కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ భక్తు రాంచందర్ మాట్లాడుతూ. గ్రామం లోని బాలికలు అదేవిధం గా మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారా న్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్న వయస్సు నుంచే సరైన పోషకాహారం తీసు కోవడం వల్ల ఆరోగ్యవంత మైన భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.అంగన్‌వాడీ సిబ్బంది కూడా పోషకా హార ప్రాముఖ్యత ను గ్రామ ప్రజలకు వివరించి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమా లను అందరికీ చేరవేయాలని కోరారు.ఈ కార్యక్ర మంలో అంగన్‌వాడీ టీచర్లు,మహిళలు, యువతులు పాల్గొన్నారు.

# ఖానాపూర్,కడెం మండలంలో రైతుల రాస్తారోకో

### ఎండల్ని లెక్క చేయకుండా రోడ్డెక్కిన రైతాంగం



ఖానాపూర్, మె 25( ప్రజా జ్యోతి ) ధాన్యం కొనుగోలు చేయాలంటూ ఖానాపూర్ కడెం మండల రైతాంగం బెండ తాకడే లెక్క చేయకుండా సోమవారం వివిధ ప్రాంతాల్లో ధర్నాలు చేశారు మార్కెట్ కమిటీ పిఎసిఎస్ ఐకెపి కేంద్రాలు ఏర్పాటు చేసి బాహాటంగా ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ప్రకటించిన అనుకున్న రీతిలో కొనుగోలు జరగకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు పంట తూకం వేసి కొనుగోలు చేసిన వాటిని తరలించడంలో సైతం అధికారులు ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వైస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు ఇటీవల అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో జాప్యం వల్ల జాన్యం తడిసి తీవ్రంగా నష్టపోయామని ఆరోపించారు ఇప్పటికైనా ప్రభుత్వం ప్రచారంలో రైతుకు మేలు చేస్తామని ప్రకటించిన నిజంగా పంటలు కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ ఎగ్బాల్ పూర్ తో పాటు నిర్మల్ -మంచిర్యాల ప్రధాన రహదారి అయిన కడెం మండలంలోని నచ్చిన్ ఎల్లాపూర్ ప్రధాన రహదారి పైన రైతులు బైటయించి ఆందోళన చేశారు. లింగాపూర్, మసాయిపేట, సారంగాపూర్, ఎలాగడప గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు తరలి వచ్చి రాస్తారోకో నిర్వహించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో నెత్తిపైన ఆకులు టోపీలులాగా ధరించి నినాదాలు చేసారు. మొక్కజొన్న, వరి ధాన్యం వెంటనే కొనాలని డిమాండ్ చేశారు. దాదాపు నెల రోజులు దాటుతున్న మక్కలు, వడ్లు కొనుగోలు చేయకుండా, తరలింపులో జాప్యం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేసారు. కలెక్టర్ రావాలని నినాదాలు చేస్తూ, హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధాన్యం తరలింపు, కొనుగోలు వేగవంతం చేయాలని కోరారు. ఇక్కడ రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, కనీసం పట్టించుకోనే నాథుడే లేదని రైతు బుర్ర రమేష్ అధికారుల తీరుపై విరుచుకు పడ్డారు. కలెక్టర్ వచ్చే వరకు కదిలేదీ లేదని హెచ్చరించారు.ఎండ తాకిడికి స్పృహ తప్పిన రైతు విపరీతంగా ఎండ ఉండటంతో పలువురు రైతులు ఎండ తాకిడిని తట్టుకోలేక పోయారు. ఆకుల నర్సయ్య అనే రైతు ఎండకు స్పృహ తప్పి పడిపోయాడు. దీనితో కొందరు రైతులు కలిసి ఆసుపత్రి కి తీసుకు వెళ్లారు. ఒక రైతు పంట కొనాలని రెవిన్యూ ఆర్ఐ కాళ్ళు పట్టుకొని వేడుకున్నాడు. చివరికి కడెం ఆర్ఐ శారద వచ్చి జిల్లా అధికారులతో మాట్లాడారు. రెండు రోజుల్లో లారీల్లో ధాన్యం తరలించి, కొనుగోలు వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. దీనితో రైతులు శాంతించారు. అధికారులు మాట తప్పితే మళ్ళీ ధర్నా చేస్తామని హెచ్చరించారు. లింగాపూర్ సర్పంచ్ రంజిత్, ఉపసర్పంచ్ స్వామి, బీజేపీ జిల్లా మీడియా కౌన్సిల్ మెంబెర్ బుర్ర రమేష్ గౌడ్, రైతుకు నర్సయ్య, శ్రీనివాస్, రాజు, రాజన్న ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఘనంగా ప్రారంభమై న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" మహిళా వారోత్సవాలు



ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా





ఆదిలాబాద్ బ్యూరో, మే 25 (ప్రజా జ్యోతి) మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. "ప్రజా పాలన - ప్రగతి ప్ర ణాళిక"లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీ యూ భవనంలో మహిళా అ భివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "మి షన్ శక్తి" మహిళా వారోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ మహిళల రక్షణ, భద్రత, ఆరోగ్యం, వారి ఆర్థిక స్వావలంబన సాధించడమే "మిషన్ శక్తి" యొక్క ముఖ్య ఉద్దేశమని, సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా వారోత్సవాలను ప్ర త్యేకంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ వారోత్సవాలు నేటి (మే 25) నుండి 30 వరకు జిల్లావ్యాప్తంగా మహిళా చట్టా లు, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం, స్వయం ఉపాధి వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపా రు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు అన్ని రకాల స్కా నింగ్‌లు, వైద్య పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ప్రైవేట్ సెంటర్లకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. మహిళలు రక్త హీనతను జయించడానికి నిత్యం ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవాలన్నా రు. అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర ఉండే ప్యాకేజ్డ్, జంక్ ఫుడ్స్ వల్ల చిన్న వయసులోనే బీపీ, డయాబెటిస్ వంటి వ్యా ధులు వస్తాయని హెచ్చరిస్తూ "సే నోటు జంక్ ఫుడ్" అని పి లుపునిచ్చారు. ఇంట్లో వండు కునే జొన్న రొట్టెలు, సాంప్రదా య ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో జరిగే అన్ని అవగాహ న కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. మహిళల్లో ఈ అంశాలపై ఆశా కార్యకర్తలు, టీచర్లు, ఏ ఎన్ ఎంలు నిరంతరం అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్, అంగన్వాడీ స్టాల్‌లను సందర్శించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యో గులకు మెమెంటో లను ముఖ్య అతిథిలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, మార్కె ట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, సంబంధిత శాఖల అధికారులు, పర్యవేక్షకులు, అంగన్‌వాడీలు, మహిళలు, సఖి కేంద్రం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

**రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి**

**ఒకే రోజు, ఏకకాలంలో 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు**

**ఆదిలాబాదు జిల్లా పరిషత్ సమావేశ మందిరం నుండి హాజరైన జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అధికారులు**






**ఆదిలాబాద్ బ్యూరో, మే 25, (ప్రజా జ్యోతి)**రాష్ట్రంలోని కోటి మంది మహి ళలను కోటీశ్వరులుగా తీర్చిది ద్దడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం "ప్రజాపాలన -- ప్రగ తి ప్రణాళిక" మహిళావారో త్సవాల్లో భాగంగా, రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామ సంఘ భవనాల (ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాలు) కు భూమి పూజ కార్యక్రమాన్ని సీఎం వర్చువల్ విధానంలో శంకు స్థాపన చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సంఘాలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వ హించిన ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి.అన సూయ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దుద్ధిల్లా శ్రీధర్ బాబు తది తరులు పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ముఖ్యమంత్రి మా ట్లాడుతూ, దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఒకేసారి 8వేల ఇందిరాగాంధీ స్త్రీ శక్తి భవనాలకు శంకుస్థాపనలు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ భవనాలు మహిళా సంఘాల ఆత్మ గౌరవానికి ప్రతీకలుగా నిలు స్తాయని తెలిపారు. రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.60, 470 కోట్ల రుణాలు అందించా మని, దీని ద్వారా సుమారు 5 లక్షల మంది మహిళలు వ్యా పారవేత్తలుగా మారారని సీ ఎం వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా, వారిని బస్సుల యజమానులుగా కూడా తీర్చిదిద్దామని అన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, సో లార్ యూనిట్లు, రైస్ మిల్లులు, గోదాములు, మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చే సుకోవాలని, ఇందుకు ప్రభు త్వం పూర్తి ప్రోత్సాహాన్ని అం దిస్తుందని తెలిపారు. హైదరా బాద్ నుండి సీఎం నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక జిల్లా పరిషత్ సమా వే శ మందిరం నుండి జిల్లా కలెక్ట ర్ రాజర్షి షా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జి ల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, జిల్లా సంక్షే మ అధికారి మిల్కా, ఇతర జిల్లా అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మహిళా సంఘాల బలోపేతానికి, వారి ఆర్థికాభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరఫున మరిం త ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి సూ చించిన విధంగా మహిళా సం ఘాల ద్వారా గ్రామాల్లో పంటల మార్పిడి, సేంద్రియ వ్యవ సాయ పద్ధతులపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చే ప ట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు అధికారులు, వివిధ మండలాల మహిళా సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సం ఘాల సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు చల్లని పానీయాలు అల్పాహారం పంపిణీ చేసిన సర్పంచ్ అన్నం రుక్మాబాయి,గణపతి




**మే 25, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నియో జకవర్గంలోని పెంచికల్పేట్ మండలంలోని కొండపల్లి గ్రామపంచాయతీలో సోమవారం ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ అన్నం రుక్మబాయి,గణపతి ఆధ్వర్యంలో చల్లని పానీయాలు,అల్పాహారం పంపిణీ చేశారు.ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో కూలీలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గ్రీన్ మ్యాట్, మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ కూలీలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనుల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్‌కు కూలీల సమస్యలనుత్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కూలీల పట్ల సర్పంచ్ చూపిన శ్రద్ధకు స్థానికులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మి, మాజీ సర్పంచ్ పారదేశీ, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేందర్, కారోబార్ శ్రీనివాస్ నాయకులు పళ్లెం పురుషోత్తం,మెడే సుధాకర్ మరియు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## పాత ఎల్లాపూర్ లో వివో బిల్డింగ్ శంకుస్థాపన,

ప్రభుత్వ పాఠశాల లొ విద్యార్థులను చేర్చాలని సర్పంచ్ ప్రశాంత్ రెడ్డి వినతి




**ఖానాపూర్ మే 25( ప్రజాజ్యోతి)** ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల వివో భవనానికి సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి వడ్డెరవాడలో సోమవారం భూమి పూజ చేశారు అనంతరం విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరాలని పంచాయతీ పాలకవర్గంతో సహా గ్రామ పెద్దలతో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేట్ పాఠశాలకు దీటుగా మాలిక సదుపాయాలు ఏర్పాటు చేసి భోజనంతోపాటు ఉచిత పాఠ్యపుస్తకాలు ఇతర సదుపాయాలు అందజేస్తున్నారని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల ను ప్రతి విద్యార్థి చేసుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి కోరారు

## ఆదివాసీల మనోభావాలు దెబ్బతీసే విధంగా పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిరికొండ పోలీస్ స్టేషన్ లో ఆదివాసి గిరిజనుల ఫిర్యాదు




**సిరికొండ, మే 25, (ప్రజా జ్యోతి)** ఆదివాసి గిరిజనులను వారి మనోభావాలను దెబ్బతీసే వి ధంగా పోస్టులు పెట్టిన వారి పై చర్యలు తీసుకోవాలని ఆది వాసి గిరిజనులు డిమాండ్ చేశారు. సిరికొండ మండల కేం ద్రములో సోమవారం ఎస్ ఐ కి ఒక వినతి పత్రం సమర్పిం చారు. ఆదివాసీల మనో భా వాలను దెబ్బతీసే విధంగా సో షల్ మీడియాలో పోస్టులు చే సిన వారిపై చర్యలు తీసుకో వాలని కోరుతూ సోమవారం సిరికొండ మండల కేంద్రములో వినతిపత్రం అందజేశారు.ఆ దివాసీ నాయకుడు, మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు పై వాట్సాప్ గ్రూ పులలో ఆదివాసీల మనోభా వాలను దెబ్బతీసే విధంగా, అ లాగే కులాల మధ్య విద్వేషా లు రెచ్చగొట్టి ఘర్షణలకు దా రితీసే విధంగా వీడియోలు, పోస్టులు ప్రచారం చేయబడు తున్నాయని పేర్కొన్నారు. ఈ వీడియోలను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పి.ఏ. పోస్టు చేసి వివిధ వాట్సాప్ గ్రూపులలో పంపి ణీ చేశారని, ఇటువంటి చర్యలు శాంతి భద్రతలకు భం గం కలిగించే అవకాశం ఉన్నం దున, సంబంధిత గ్రూపులలో ఉన్న వారిపై ఎమ్మెల్యే పి.ఏ. పై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మాధవ్ పటేల్, జనరల్ సెక్రటరీ షేక్ ఇమామ్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్ మాజీ జెడ్పిటిసి రఘురాం మైనార్టీ చైర్మన్ షేక్ రంజాన్ దత్తు మహేందర్ కుమురం యాదవ్ రావు లక్ష్మణ్ పవర్ ప్రవీణ్ కుమార్ బాదు పటేల ఎల్లన్న లక్ష్మీకాంత్ చిన్నయ్య పాల్గొన్నారు.